క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామపెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురంలో నూతన రామాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో శంకుస్థాపన పూజల్లో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోషబాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామపెద్దలు అట్టాడ కనకారావు, పైడపునాయుడు, దవళ లక్ష్మణరావు, మొయిద లక్ష్మణ పాల్గొన్నారు.

వైభవంగా చక్రతీర్థ ఉత్సవం



చక్రతీర్థ ఉత్సవంలో రుత్విక్కులు, భక్తులు

డెంకాడ: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చక్రతీర్థ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాందూరి జగన్నాథాచార్య స్వామి ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్లపై విమర్శలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : సేవచేస్తున్న వలంటీర్లపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గోవిందపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. కేవలం ఐదు వేల రూపాయల గౌరవ వేతనంతో నిస్వార్థంగా సేవలు చేస్తున్నారని చెప్పారు. కోవిడ్ సమయంలో టీడీపీ నాయకులు ఇంటి వద్ద నిద్రపోతే.. వలంటీర్లు గడప గడపకూ వెళ్లి సేవలందించారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రజలను దోచుకుంటే.. వలంటీర్లు సేవలు చేశారని తెలిపారు. టీడీపీ నాయకులు వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సింహాచలంలో భక్తి గీతాలాపన



సింహాచల దేవస్థానంలో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సింహాచలం నృసింహస్వామి దేవస్థానంలో గురువారం భక్తిగీతాలాపన చేశారు.సంస్థ వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు ఆధ్వర్యంలో గీతాలు ఆలపించారు. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను సత్కరించారు.

వినతి

విజయనగరం ఫోర్ట్: బకాయి జీతాలు ఇప్పించాలని ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. ఈ మేరకు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయక స్వామికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: కొత్తపేటలో కొలువైన సంపత్ వినాయకస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. వివిధ సుగంధద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త పైడిరాజు హోమంలో పూర్ణాహుతి వేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆకర్షణీయంగా మారిన జొన్నవలస ఉన్నత పాఠశాల



దుప్పాడలో డిజిటల్ విధానంలో విద్యాబోధన



దుప్పాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి ట్యాంకు



మలిచర్ల పాఠశాలలో తాగునీటి కుళాయిలు

బాగు బడింది

- నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా రెండు విడతల్లో రూ. 6.05 కోట్లు విడుదల
- 22 పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు
- విద్యాభివృద్ధికి సీఎం జగనన్న చేస్తున్న కృషికి ప్రశంసలు
- తెలుగుదేశం పాలనలో మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు పడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



రాకోడు పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టర్



మలిచర్ల పాఠశాల భవనం



గుంకలాం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం



గుంకలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెరుగైన వసతులతో నిర్మించిన మరుగుదొడ్లు

విజయనగరం రూరల్: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడమే కాకుండా తరగతి గదుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్ల కిందట నాడు – నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విడతల వారీగా పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. అలాగే డిజిటల్ విద్యాబోధనకు ఏర్పాట్లు చేయడంతో పాటు అదనపు భవనాలు నిర్మించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం మండల పరిధిలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో తొలివిడతలో నాడు – నేడు కార్యక్రమంలో 18 పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి రూ. 4.39 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యుత్, రక్షిత తాగునీరు, డిజిటల్ పరికరాలు ఏర్పాటుతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, రన్నింగ్ వాటర్ సదుపాయం, విద్యార్థులకు బెంచీలు, తరగతి గదుల భవన నిర్మాణాలు, మరమ్మతులు, తదితర పనులు పూర్తి చేశారు.

రెండో విడతలో 11 పాఠశాలల్లో..

రెండో విడత నాడు – నేడు కార్యక్రమంలో 11 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1.61 కోట్లు మంజూరు చేయడంతో ఆయా పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు మించి సదుపాయాలు కల్పించడంతో పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీఓల విధులు కీలకం

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెల్లిమర్ల: ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ ఆఫీసర్స్ విధులు అత్యంత ప్రతిష్టాత్మకమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని.. ఒక్క తప్పు కూడా దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. నెల్లిమర్ల నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ ఇచ్చిరు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, పీఓలు, ఏపీఓల విధులు, బాధ్యతలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని.. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట్ త్రివినాగ్, జేసీ కె. కార్తీక్, నియోజకవర్గ రిటర్నింట్ అధికారి ఎం. నూకరాజు, నాలుగు మండలాల సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

అహింసా రన్‌ను విజయవంతం చేయండి



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను మర్యాదపూర్వకంగా కలిసిన జీతో ప్రతినిధులు

విజయనగరం టౌన్: జైన్ శ్వేతాంబర్ తేరా పంత్ మహిళా మండలి (జీతో) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఆదివారం ఉదయం 5.30 గంటలకు నిర్వహించనున్న అహింసా రన్‌ను విజయవంతం చేయాలని జీతో జిల్లా చైర్‌పర్సన్ రీమా కొఠారి, కార్యదర్శి హర్షితా సురానా, ప్రతినిధులు జ్యోతి, నేహా కోరారు. ఈ మేరకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎస్పీ ఎం.దీపిక, తదితరులను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్‌సీఎస్ రోడ్డు పెద్దచెరువు గట్టువద్దనున్న మహాత్ముని విగ్రహం నుంచి రన్ ప్రారంభమవుతుందని, ఇందులో సుమారు 300 మంది పాల్గొంటారని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువజన విభాగం కీలకపాత్ర పోషించాలి

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ విజయంలో పార్టీ యువజన విభాగం కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్ పిలుపునిచ్చారు. డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కొండకరకాం, ద్వారపూడి గ్రామాల్లో యువజన కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత యువజన విభాగంపై ఉందన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థతో 1.4 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. 2.5 లక్షల మంది వలంటీర్లను నియమించడంతో పాటు స్కిల్ డవలప్‌మెంట్ విభాగం ద్వారా పరిశ్రమలు, ప్రముఖ సంస్థల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, తద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును వివరించాలన్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు, వారికి వంతపాడుతున్న ఎల్లో మీడియా దుర్మార్గపు, అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిలారి రాంబాబు, యువజన విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్‌కు సర్వం సిద్ధం

విజయనగరం టౌన్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు సిమ్స్ బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి, సంఘమిత్ర డాక్టర్ ఆర్ఎస్.జాన్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక చర్చి ఆవరణలో జిల్లా కేంద్రంలో ఉన్న పలు చర్చి పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30న ఉదయం 6 గంటలకు చర్చి ఆవరణ నుంచి వందలాది మంది క్రైస్తవ భక్తులతో కలిసి భారీ ర్యాలీని ప్రారంభిస్తామన్నారు. క్రైస్తవ భక్తులందరూ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తాలాడ ఆనందరావు, వై. యబ్బోజు చౌదరి, సత్యరాజ్, పిరిడి పాల్, ఏసుదాస్, కరుణ, భానుశామ్యూల్, రఘు, మధుమనోహర్, శ్రీనివాస్, పాల్, తదితరులు పాల్గొన్నారు.

పన్ను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు..

విజయనగరం: ఇంటి, ఆస్తి పన్ను స్వీకరించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను ఒకసారి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెలవు దినాల్లో కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా పన్నులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: ఫూల్‌బాగ్‌లోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రుక్సానా ఫరీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మే 22 లోపు ఆన్‌లైన్‌లో ప్రవేశ రుసుం చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి..

- 108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నజీర్ హుస్సేన్

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని 108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్ అన్నారు. గురువారం స్థానిక సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో 108 అంబులెన్స్‌లలో పనిచేస్తున్న ఈఎంటీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదం జరిగిందని కాల్ సెంటర్ నుంచి సమాచారం రాగానే సంఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేయడం, అంబులెన్స్‌లో ఉండే పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓజెటి శ్రీనివాసరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సాయిషణ్ముఖ్, రవికుమార్, ఉపేంద్ర పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించండి..



గోవిందపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, రఘుబాబు, తదితరులు

- అన్ని వర్గాలకూ అండగా జగన్ మోహన్‌రెడ్డి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

పూసపాటిరేగ: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గోవిందపురం, భరిణికాం, లంకలపల్లిపాలెం గ్రామాలలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి గురువారం ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధిని వివరించి వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కుల, మత, రాజకీయ వర్గాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఎన్నికలముందు చంద్రబాబు నాయుడు స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మొండిచేయి చూపారన్నారు. అదే జగన్ మోహన్‌రెడ్డి ద్వాక్రా సభ్యులకు రుణమాఫీ చేసి చూపించాడని కొనియాడారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. నియోజకవర్గంలో ఫ్లోటింగ్ జెట్టీ, భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, కుమిలిలో రామతీర్థసాగర్ రిజర్వాయర్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మళ్లీ మాయమాటలతో వస్తున్న టీడీపీ కూటమి సభ్యులకు బుద్ధి చెప్పి ఓటుతో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, పట్టెపు శ్రీనివాసరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, దంగుడుబియ్యపు సునీత, డి. ఈశ్వరరావు, రౌతు సాయికుమార్, రౌతు వెంకటరత్నం, బొల్లు రమేష్, పైడి మధు, ,తాడిశెట్టి బాబు, దేశెట్టి గణేష్, జనపాల అప్పారావు, రౌతు సాయికుమార్, వాళ్లె సన్యాసినాయుడు, బర్రి చినఅప్పన్న, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కోట్ల రఘు, మహంతి లక్ష్మణరావు, పి. నారాయణరావు, పి. సత్యం, ఎడ్ల రామకృష్ణ, శాంతాటి శ్రీనివాసరావు, టొంపల సీతారాం, బూర చిన్న, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే విజయ సోపానాలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 6వ డివిజన్ జమ్ము ప్రాంతంలో ఎన్నికల ప్రచారం
- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన పలు కుటుంబాలు



జమ్ము ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేపడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారదర్శకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు.... స్థానికంగా తాము చేసిన నగరాభివృద్ధే తమ విజయానికి సోపానాలుగా నిలవనున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 6వ డివిజన్ జమ్ము ప్రాంతంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలే తప్ప.. ఎన్నికలప్పుడు కనిపించే నాయకులను కాదని సూచించారు. సంక్షేమ పథకాలను అవినీతిరహితంగా అందించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందుకే ప్రజలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ పట్ల ఆదరణ చూపుతున్నారని చెప్పారు. టీడీపీ నాయకులు, కొన్ని పత్రికలు తప్పుడు ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్నాయని, అయితే ఎవరెన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. మంచి పనులు చేయబట్టే తాము ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడుగుతున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలన్నీ పరిష్కరించామని తెలిపారు. టీడీపీలో ఉండే కార్యకర్తలు అనేకమంది నేడు వైఎస్సార్‌సీపీలోకి రావడం సంతోషదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉండే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. అంతకుముందు స్థానిక ప్రజలు కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లి, హారతులు పట్టి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మేయర్ వి. విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శోభార్గవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, బోడసంగి ఈశ్వరరావు, పొంతపల్లి గోపి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు..

నగరంలోని 6వ డివిజన్ జమ్ము ప్రాంతానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీ కూటమిని వీడి వైఎస్సార్‌సీపీలో గురువారం చేరాయి. డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి నేతృత్వంలో రౌతు అప్పలనాయుడు, కోట్ల మహేష్, కోరాడ వెంకటరావు, కోరాడ కిశోర్‌కుమార్‌లతో పాటు పలు కుటుంబాలు పార్టీలో చేరగా.. వారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ సంతోష్‌కుమార్

నెల్లిమర్ల: జరజాపుపేటకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ మద్దిల సంతోష్‌కుమార్ అరుదైన బి నెగిటివ్ రక్తాన్ని గురువారం దానం చేశాడు. వివరాల్లోకి వెళితే... విజయనగరం గాయత్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బి.చంద్రకళకు అత్యవసరంగా బీ నెగిటివ్ రక్తం ఎక్కించాల్సి వచ్చింది. దీంతో ఆమె బంధువులు సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్‌ని సంప్రదించారు. ఈ నేపథ్యంలో దుర్గా ప్రసాద్ వెంటనే స్పందించి మద్దిల సంతోష్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. అయితే సంతోష్ విశాఖలో ఉద్యోగం చేస్తున్న నేపథ్యంలో అక్కడే ఛత్రపతి శివాజీ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశాడు. రోగి బంధువులు రక్తాన్ని తీసుకువచ్చేందుకు అవసరమైన రవాణా సౌకర్యాన్ని ఎన్‌వీఎస్ బ్లడ్‌బ్యాంక్ వారు ఏర్పాటు చేశారు. సమయానికి రక్తదానం చేసిన సంతోష్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

రామనారాయణం దశమ వార్షికోత్సవం రేపు



ఆహ్వాన ప్రతులను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణం దశమ వార్షికోత్సవం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వాన ప్రతులను గురువారం ఆవిష్కరించారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు దేవతామూర్తులకు అష్టకలశ స్నపనం, 9 గంటలకు విశేష అర్చన, 10 గంటలకు నవగ్రహ హోమం, మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్ణాహుతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణునికి, సీతాకోదండ రామస్వామికి వార్షిక కల్యాణాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ఏవీ రమణ, ఆలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.